# నిరాశ్రయ

శ్రీమతి ఎమ్. లక్ష్మీదేవి

అది సూర్యోదయం. సూర్యమహారాజు వచ్చుచున్నాడని మందమారుతం ప్రకృతిదేవికి చెప్పింది. ప్రకృతిదేవి సిగ్గువల్ల చెక్కులెఱ్ఱపడ్డట్లు ప్రాగ్దిశ అరుణవర్ణముతో అలరారుతుంది. త్రుటిలో చిరునవ్వులో ప్రేయసి వదనారవిందాన్ని ప్రేమపూర్వకముగా తిలకిస్తూ భాస్కరుడు ఆకాశతలాన్ని అధివసించాడు. పక్షులు కిలకిలారావంతో స్వాగతమిచ్చింది. మలయమంద సమీరుడు పూసురటితో సేదదీర విసిరాడు. చెఱువుగట్టున బ్రాహ్మణులు అర్ఘ్యాలు విడుస్తున్నారు. బిచ్చగాళ్ళు ఏదో ఆశతో ఊర్లోకి నడుస్తున్నారు. ప్రపంచమంతా ప్రాతఃకాలం ప్రసన్నంగానేఉంది.

కానీ ... ఆ విశాల విశ్వంలో ఒక అభాగిని తన విశాల నేత్రంతో విశాల విశ్వాన్ని విలోకిస్తూంది.

చెఱువుగట్టుననున్న రావిచెట్టు అరుగుమీద కూచుంది. రెండు నిముషాల్లో నలుగురైదుగురు వేపపుల్లలు చేతపట్టుకొని అక్కడికివచ్చి "ఓ అమ్మో! లే అక్కణ్ణుంచి – దర్జాగావచ్చి కూచున్నావు – నీవు కట్టావా! నీయబ్బ కట్టిపెట్టిండా! లేలే" అని గర్జించాడొకాయన. మౌనంగా వాళ్ల మొహాలకేసిచూసి అక్కణ్ణుంచి లేచి చెఱువుగట్టున కూర్చుంది.

"వారు మాత్రం ఆ అరుగునుకట్టారా! లేక వాళ్లబ్బలుకట్టారా" అని గొణుక్కుంది. వాళ్లైదుగురూ పళ్లు తోముకుంటూ, మధ్య మధ్య నవ్వుతూ లోకాభిరామాయణం మాట్లాడుతున్నారు.

"ఆ అరుగుమీద కూర్చోటానికి వారికి మాత్రం ఏం హక్కుంది?

తన విశాల హస్తాలతో గొడుగులాగ ధనవంతులు ఆదరించకున్నా నిరుపేదలకు నేనాశ్రయమిస్తాను రండని" అంటూ అభయమిస్తూన్న రావిచెట్టునీడనుంచికూడ ఎందుకు తరిమేస్తారీమానవులు? తామేమో ఆశ్రయమియ్యరు! రావిచెట్టుకు గనుక మాట్లాడే శక్తిఉంటే నిరాశ్రయులైన బిచ్చగాళ్ళను గురించి ఎంతజాలి కలిగేట్టుగా వర్ణించేదోగదా" అని అనుకుంది తనలోనే. లేకపోతే ముష్టిదాని కమ్యూనిష్టు ప్రతిపాదనను ఆమోదించేవారెవరు?

ఇంతలో ఇద్దరు బ్రాహ్మణులు స్నానాల

కోసం అక్కడికి వచ్చారు. "ఛీ! ముద రష్టపుదానా! దాపురించావు. రోజు నీ మొహాన మండిపడి చావాలి. మేం స్నానాలు చెయ్యాలి. అలా ఎక్కడికైనా తగులడి పోగూడదూ" అన్నాడొకాయన ఆమెకేసి ఉరిమిచూస్తూ.

జాలిగాచూస్తూ ఒక్క నిట్టూర్పువుచ్చి అర్ధఫర్లాంగు దూరంలోఉన్న పచ్చగడ్డి మైదానంలో కూలబడింది ఆలోచిస్తూ. ఆమెకు గోచరించింది వేదాంతమే. "ఏం ప్రపంచం? ఇదెవరికి సొంతం? నేనెక్కడా నిల్చోకూడదా? నేనూ మనిషి నేకదా! భగవంతుడు సృష్టించిన భూమిమీద కూడా ఉండగూడదా" అనుకుంది.

"ఏయ్! అమ్మీ! లే, లే, నీకోసం పరిచిన తివాసి అనుకొన్నావా! లేక మెత్తటి పరుపనుకొన్నావా! ఇక్కడొచ్చి కూచున్నావు! ముందు అక్కణ్ణుంచిలే! మహారాజుల ఆవులు మేయాలి. నువ్వు కూచుంటే అవి మూతికూడ పెట్టవ్, లే, తొందరగా."

తిరిగిచూసింది. ఆవులమేపే కుఱ్ఱవాడు చేతకఱ్ఱపట్టుకొని అధికారభావంతో నిలబడి ఉన్నాడు. "ఆఁ. లేస్తావా! లేదా!" ఒక్కసారి గర్జించాడు. విధిలేదు. ఒక్కసారి విశాల దృష్టితో కలయచూసింది. వాళ్లింకా రావిచెట్టు అరుగుమీదనే కూర్చొని మాట్లాడుతున్నారు. బ్రాహ్మణులు స్నానాలు చేస్తూనే ఉన్నారు. చిందరవందరలైన ఊహాలతో తిన్నగా నడుస్తూంది ఊళ్ళోకి.

అంతకు ముందు అడుక్కుంటూన్న బిచ్చగాళ్ళే ఇంటి వాళ్ళచేత తిట్లుతిని వట్టి చేతులతో ఎదురు పడ్డారు. ఆమెలో ఇప్పుడు ఆర్థిక జీవితాన్ని గురించిన ఆలోచన్లులేవు. తనకు తోచని, తనకు అందరాని ఏదో ఆభిప్రాయాన్నిగురించి ఆలోచిస్తూంది. ఈ ఆలోచనతోనే మెల్లగా నడుస్తూంటె రోడ్డుమీద, అధికారవర్గం అనుమతిస్తూందా? బఱ్ఱున వచ్చింది ఒక కారు. దాని త్రోవనుండి తప్పుకోటానికి ప్రక్కకు తప్పుకుంది. అప్పుడే స్నానంచేసి వేగంగా వెళ్తూన్న వెంకయ్య శాస్త్రిగారి చేత వెయ్యిసార్లు 'పాపిష్టిముండ' అనిపించుకొంది.

ఒక పెద్దబంగళా చుట్టూ విశాలమైన తోట. ఆప్రదేశం ఎంతో రమణీయంగా ఉంది. ఆమెలో ఒక ఆశ-ఇక్కడ బిచ్చమడిగితే తప్పక పెడతారని. గేటు దగ్గర కెళ్ళింది. కాపలా జవాన్ చేత కఱ్ఱపట్టుకొని "ఏయ్, వెళ్ళు. అవతల పో, ఇదెవరి ఇల్లు అనుకున్నావ్? జాగ్రత్త" అని గర్జించాడు. ఆమె రెండడుగులు వెనుక వేసింది. కాని ఆమె హృదయంలోని ఆశ మాత్రం పోలేదు. మెల్లిగా కాపలావాని

కంటబడకుండ పెరటిగేటు దగ్గరకు వెళ్ళి “అయ్యా! బీదదాన్ని – ఒకింత కబళం పడెయ్యండి బాబూ! అమ్మా! తల్లీ!” అని పుట్టినప్పటినుంచి ఆలాపిస్తూ వస్తూన్న ఆ వృత్తి గీతికను ఆరంభించింది. పలుకలేదు. మళ్ళా గట్టిగా “అయ్యా దిక్కులేని దాన్ని – మహా ప్రభో!” – లోపలినుంచి “ఏమ్, ఎవరక్కడ? ఏమిటా మొత్తుకోళ్లు” అన్నశబ్దం. ఇంతలో ఒకజవాన్ వచ్చి “అయ్యగారు కోప్పడుతున్నారు. వెళ్లు!” అని గదమాయించాడు. అతని భీకరమైన మీసాలను, గంభీరమైన మొహాన్ని చూసి గజగజ వణకిపోయింది. మారు మాటాడకుండా అశ్రుజలనయనాల్తో అతణ్ణి చూసి కదిలింది. ఆఖరుకు ఆరోజు గాంధీమహాత్ముని పునిత వ్రతాన్నే అనుసరించింది.

◆ ◆ ◆

సంధ్యాకాలం ప్రభాకరుని వియోగాన్ని సహింపక ప్రకృతిదేవి ఏడ్చి ఏడ్చి కన్నులెఱ్ఱపడ్డట్లు సంధ్యారుణరాగాలు వ్యాపించాయి. తన వ్యథను పోగొట్టి చల్లని చూడ్కులతో తన్నోదార్చు నెచ్చెలి చంద్రిక కూడా నేడు రాదుగదా! అని ప్రకృతి దేవి మరింత విచారంతో చీర చెఱగుతో కన్నీళ్లు తుడుచుకొంది. చెఱగు కదలిక వల్ల వచ్చిన వేడిగాలి దేవి దుఃఖాన్ని తెల్పుచున్నట్లున్నది. చీకటి దట్టంగా ఆవరించిన కొలది దేవి హృదయ భారం అధికమై, కార్మేఘములు క్రమ్మి వర్షం కురియగా దేవి దుఃఖాశ్రువులు గాబోలు – ఆ అశ్రుజలాన్ని తుడుచుకోడానికి చేతులల్లాడించినప్పుడు మెఱుపుల చేతుల కంకణాలా అనిపించింది.

చెఱువు గట్టున రావిచెట్టు అరుగ మీద కూచొని కటిక చీకటిని కలయజూసింది. మెల్లిగా లేచింది. తల గిఱ్ఱున తిరిగింది. ‘దభీ’ మని క్రింద కూలిపోయింది. ఎదుటనున్న చెఱువు శాంతంగా ప్రవహిస్తూంది.

వాన జోరున కురుస్తూనేఉంది. చిరిగిన పాతపేలికలు తడిసిపోయినవి. చలిలో గజగజ వణకుతూంది. “ఈ నిరాశ్రయను ఆదరించే దాతలే లేరా – దేవుడా! నీ వొక్కడవేవున్నావా” అని ఆమెలోనాస్తిక వాదం ప్రబలింది. అసహాయస్థితిలో నిరాశలో మొలిచేది నాస్తికమేగా –

“నిరాశ్రయులైన భిక్షుకులను ఆదరించేవారీప్రపంచంలో ఎవ్వరూ లేరా” అని దిక్కులు ప్రతిధ్వనించేలాగ కేకలేస్తూ ఆ కటిక చీకటిలో కలవటానికి పరుగెత్తుకొనిపోయింది.

ఆ నిర్మానుష్య ప్రదేశంలో హృదయద్రావకమైన ఆమె మాటలు వినే దిక్కెవ్వరు? అవన్నీ గాలిలో కలిసిపోయాయి; ఆమె చీకట్లో కలిసిపోయింది. ప్రకృతి దేవి హృదయం నిరాశ్రయభిక్షుకి విలాపానికి నిర్దయులపై ఉరిమింది. ఆమె కన్నులనుండి వెల్వడ్డ క్రోధవీక్షణం భయంకరంగా మెరిసింది. ఏమీ ఎరుగనట్లు చెఱువు ప్రశాంతంగా ప్రవహిస్తూంది.